నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 19 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET




మాజీ మంత్రి కేటీఆర్ ఆటో నడుపుతుండగా పక్కనే కూర్చున్న ఎమ్మెల్యే విజయుడు

## ఆటోడ్రైవర్ల సమస్యలు పట్టవా?

- కాంగ్రెస్ పాలనలో వంద మంది ఆత్మహత్య
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి ఆటోడ్రైవర్లకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 18 : ఆటో డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ఏడాది కాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నా వారి సమస్యలను పట్టించుకోరా అని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో వంద మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఆటో డ్రైవర్ల ఆందోళనకు సంఘీభావంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఆటో నడుపుకుంటూ వెళ్లగా ఎమ్మెల్యే విజయుడు కేటీఆర్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొని ఆటో డ్రైవర్లకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆటో డ్రైవర్లు అప్పుల పాలు కావడంతోపాటు అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఆటోడ్రైవర్ల సమస్యను పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.



# మాఫీ మాకేదీ?

- బ్యాంకుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించేందుకు గుట్టుగా యత్నం
- ససేమిరా అంటున్న కిందిస్థాయి ఉద్యోగులు
- కోటి ఆశలతో రుణమాఫీ కోసం ఎదురుచూపులు
- నాలుగో విడుత రుణమాఫీలో నలుగుతున్న రైతులు
- సీఎం ప్రకటించి పక్షం రోజులైనా అందని డబ్బులు

వనపర్తి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఇక రుణమాఫీ పూర్తి చేశాం.. మిగిలిన నాలుగో విడుతను విడుదల చేశాం.. అంటూ ప్రభుత్వంలోని పెద్దలు ప్రకటనలు గుప్పించారు.. గత నవంబర్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల్లో చివరి రోజున సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ సమీపంలోని అమిస్తాపూర్‌లో నిర్వహించిన సభలోనూ రుణమాఫీని ప్రకటించిన సంగతి విధితమే. జిల్లా పరిధిలోని 14 మండలాల్లో 4వ విడుతల్లో దాదాపు రూ.48.79 కోట్లు విడుదల చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి 5,366 మంది రైతులకు రుణమాఫీ కింద ఈ డబ్బులు జమ చేయాల్సి ఉంది. ఇదివరకు మూడు విడుతల్లో జిల్లాలో 53,640 మంది రైతులకు రూ.426.76 కోట్లు రుణమాఫీ అయ్యింది.

***బ్యాంకుల చుట్టూ చక్కర్లు***

నాలుగో విడుత రుణమాఫీ లిస్టులో పేర్లున్నాయని తెలుసుకున్న రైతులు బ్యాంకులకు పరుగెత్తుతున్నారు. ఏకంగా సీఎం ప్రకటించడంతో తమకు డబ్బులు నమ్మకంగా పడి ఉంటాయన్న ఆశతో రైతులు వెళ్లి నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. బ్యాంక్ మేనేజర్లు డబ్బులు రాలేదని చెబుతుండడంతో అయోమయానికి గురవుతున్నారు. తమ బాధను ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి అన్నదాతలకు దాపురించింది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా ప్రకటనలు చేశారు తప్పా.. ఆచరణలో రుణమాఫీ వందశాతం కాలేదని రైతులు ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడుతున్నారు. మాఫీ ప్రకటన వెలువడినప్పటి నుంచి బ్యాంకు మేనేజర్లకు రైతులతో తలనొప్పిగా మారింది. ఒక్కొక్క రైతు పదే.. పదే బ్యాంకుకు వచ్చి అడుతుండడం వల్ల బ్యాంకు సిబ్బంది విసుగెత్తుతున్నారు.

***ఉద్యోగులను గుర్తించాలి..***

రుణమాఫీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించాలని అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులు కిందిస్థాయి ఉద్యోగులకు ఈ సూచన చేస్తున్న క్రమంలో ఉద్యోగులు ససేమిరా అంటున్నట్లు తెలిసింది. లిస్టుల్లో పేర్లు వచ్చిన తర్వాత తొలగించడం ఇబ్బందికరంగా ఉంటుందన్న భావన వ్యక్తమవుతున్నది. ఈ పరిస్థితిలో గ్రామస్థాయిలో ఉద్యోగులు వెళ్లి తొలగిస్తాం అనే ప్రస్తావన తీసుకురావడం అంత సులువైన పనికాదు. పలు దఫాలుగా ఉద్యోగులను గుర్తించాలని ఒత్తిళ్లు చేస్తున్నా.. కిందిస్థాయి ఉద్యోగులు మాత్రం తమతో కాదని పట్టించుకోవడం లేదు. దీంతో ఈ ప్రక్రియ ఎటూ తేలకుండా పోతున్నది. ముందు నుంచి విధివిధానాలు పట్టించుకోకుండా ఇప్పుడు నాలుగో విడుతలో ఉద్యోగులను గుర్తించాలనడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే.. కొన్ని చోట్ల కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు సైతం రుణమాఫీ అయ్యింది. దీనిపైనే ఎటూ తేల్చుకోలేక ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తున్నది.

***అంతా సందిగ్ధం..***

నాలుగో విడుత రుణమాఫీకి సంబంధించి అంతా సందిగ్ధం అన్నట్లుగానే ఉంది. ఏ అధికారిని అడిగినా తమకు తెలియదంటూ దాటవేస్తున్నారు. ఆడంబరంగా ప్రకటనలు.. ఉత్తేజంగా ప్రజాపాలన సంబురాలు నిర్వహించిన ప్రభుత్వం ఉన్నట్లుండి చివరి విడుతను పెండింగ్ పెట్టేయడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ఎవరు కూడా క్లారిటీగా ఇవ్వలేకపోతున్నారు. ఇటు ప్రజాప్రతినిధులు.. అటు ప్రభుత్వ అధికారులు కూడా స్పష్టమైన సమాచారాన్ని అందించడంలో వెనుకాముందు అవుతున్నారు. దీనికంతటికి కారణం ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడమేనన్న వాదన వినిపిస్తున్నది.

ఈ క్రమంలో బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ మాఫీ లిస్టులో ఉన్న రైతులు ఆందోళనతో పరుగులు పెట్టక తప్పడం లేదు.

### రుణమాఫీ డబ్బులు జమకాలేదు..



నాకు అమరచింత యూనియన్ బ్యాంకులో రూ.లక్షా 26 వేల అప్పు ఉంది. నాలుగో విడుత రుణమాఫీ లిస్టులో నా పేరుంది. ఇప్పటి వరకు నా అకౌంటులో డబ్బులు జమకాలేదు. బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోతున్నా. అధికారులు సమాధానం చెప్పాలంటే కూడా విసుక్కుంటున్నారు. స్వయంగా సీఎం పాలమూరుకు వచ్చి చెప్పి కూడా చాలా రోజులైంది. అయినా ఇంకా డబ్బులు రాలేదు.

*- శ్రీకాంత్, రైతు, అమరచింత*

### రూ.40 వేలు వడ్డీ కట్టినా..



అమరచింత యూనియన్ బ్యాంకులో నాకు రూ.2లక్షల 40వేలు పంట రుణం ఉంది. మూడు విడుతల్లో రుణమాఫీ రాలేదు. చివరలో మాఫీ వస్తుందని వ్యవసాయ అధికారులు ఫొటోలు తీసుకున్నారు. నా రుణంలో రూ.2 లక్షలకుపైగా ఉన్న రూ.40 వేలు కట్టమని చెబితే కట్టేశాను. నాలుగో విడుత లిస్టులో పేరైతే ఉంది. కానీ డబ్బులు మాత్రం అకౌంట్‌లో పడలేదని అధికారులు చెబుతున్నారు. ఈ రుణమాఫీ మాకు గొంతులో ముల్లు ఇరుక్కున్నట్లుగా ఉంది.

*- ఆంజనేయులు, రైతు, అమరచింత*

### ఇంకా రుణమాఫీ కాలేదు..



నాకు 4.02 ఎకరాల పట్టా భూమి ఉండగా మూడేండ్ల కిందట మండలకేంద్రంలోని ఎస్‌బీఐలో రూ.1,80,000 వ్యవసాయ రుణం పొందాను. నిర్దిష్ట సమయానికి క్రమం తప్పకుండా రుణాన్ని రెన్యువల్ చేశారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో నాకు రుణమాఫీ కాలేదు. బ్యాంక్‌లో సరైన ధ్రువపత్రాలు ఇచ్చినప్పటికీ నాలుగో విడుత రుణమాఫీలో కూడా లిస్టులో నాపేరు రాలేదు. కొందరికి లిస్టులో పేర్లు వచ్చినివి, కానీ అకౌంట్లలో డబ్బులు జమకాలేదు.

*- మడిగ నర్సింహ, మాధవరావుపల్లి, పాన్‌గల్ మండలం*

## ఆటో కార్మికులకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో ఆటోలతో నిరసన ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 18 : ఆటో కార్మికులకు బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఆటోలతో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ఆటో కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటో యూనియన్ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, ప్రతి కార్మికుడికి సంవత్సరానికి రూ.12వేలు అందిస్తామని, పిల్లల చదువుల కోసం ప్రత్యేక స్కీం, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. హామీలను నెరవేర్చని ప్రభుత్వం ఆటో కార్మికుల బతుకులను బజారుకు ఈడ్చారని గుర్తుచేశారు. కార్మికులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, ప్రతి విషయంలో సహకరిస్తానని అధికారులతో మాట్లాడి ఇబ్బందులు కలుగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అనుబంధ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్న, కంచె రవి, బీఆర్‌ఎస్ నాయకులు పరంజ్యోతి, ఇమ్రాన్, గిరి, చిట్యాల రాము, సునీల్, రామస్వామి, కోట శ్రీను, ఆటో యూనియన్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, అనిల్ ఉన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టిన ఆటో కార్మికులు

వంటా వార్పు



***సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె కొనసాగుతోంది. రోజుకో విధంగా వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తున్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద మహిళా ఉద్యోగులు మోకాళ్లపై నిలబడడంతోపాటు వంటావార్పు చేపట్టారు. వీరి దీక్షకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. శ్రమదోపిడీకి గురవుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు డిమాండ్ చేశాయి.***

*- మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 18*

## చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

అయిజ రూరల్, డిసెంబర్ 18 : మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామ సమీపంలో ఉన్న లింగమ్మ చెరువులోకి బుధవారం ట్రాక్టర్ దూసుకెళ్లింది. గ్రామానికి చెందిన భానుగౌడ్ వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌తో పొలానికి వెళ్తుండగా ఎదురుగా బొలెరో రావడంతో దానిని తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్ చెరువులోకి దూసుకువెళ్లి బోల్తాపడింది. అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా ఒడ్డుకు చేరాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.



అదుపు తప్పడంతో చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

# దొంగల హల్‌చల్

- పెబ్బేరు హైవేపై నిలిపిన కారులో ప్రయాణికులపై రాళ్లతో దాడి
- 14 తులాల బంగారం, బ్యాగుల చోరీ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పెబ్బేరు, డిసెంబర్ 18 : 44వ జాతీయ రహదారిపై దొంగలు స్వైర విహారం చేశారు. కారులోని ప్రయాణికులపై దాడిచేసి వారి నుంచి 14 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అడ్డుకున్న వారిని తీవ్రంగా గాయపర్చారు. పెబ్బేరు పట్టణానికి సమీపంలో హైదరాబాద్ వెళ్లే రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. ఎస్పీ రావుల గిరిధర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం మేరకు.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కూజన్‌కొత్తూరుకు చెందిన మూడు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది కారు(టీఎస్ 16ఎఫ్ జే 2266)లో అరుణాచలం, తిరుపతి ప్రాంతాలకు తీర్థయాత్రలకు వెళ్లారు. వారు తిరిగి వస్తున్న క్రమంలో విశ్రాంతి కోసమని జాతీయ రహదారి పక్కన భారీ ట్రక్కులు నిలిపే స్థలంలో కారు ఆపుకొని అందులోనే నిద్రపోయారు. ఈ సమయంలో గుర్తుతెలియని దుండగులు నలుగురైదుగురు కారు అద్దాలు పగులగొట్టి దాడి చేశారు. మహిళలపై ఉన్న బంగారు వస్తువులను లాక్కొనే క్రమంలో అందులోని మగవారు అడ్డుకున్నారు. దీంతో దొంగలు వారిని రాళ్లు, కత్తులతో తీవ్రంగా గాయపర్చారు. గాయాలకు లోనైన సంతోష్, శ్రీశాంత్, ప్రణీత్‌ను మొదట వనపర్తి ఏరియా దవాఖానకు, తర్వాత మహబూబ్‌నగర్‌కు జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. దొంగలు 14 తులాల బంగారంతో పాటు, కారు టాప్‌పై ఉన్న బ్యాగులను ఎత్తుకెళ్లారు. ఈ సమయంలో పక్కనే మూత్రశాలలకు కాపలా ఉండే వ్యక్తి నివాసముంటున్న గదిని బయట నుంచి గడియ పెట్టారు. మహిళల అరుపులు వినిపిస్తున్నా అతడు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. చోరీ అనంతరం బాధితులు గడియ తీయడంతో అతను బయటకు వచ్చి 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. 108 అంబులెన్స్‌లో బాధితులను దవాఖానకు తరలించారు. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీంచారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లు చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించాయి.



కారు అద్దాలు పగలగొట్టిన దుండగులు



బాధితులతో మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ గిరిధర్

## క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు మాయం

- సైబర్ క్రైంకు బాధితుడి ఫిర్యాదు

వెల్దండ, డిసెంబర్ 18 : సైబర్ నేరాగాళ్ల మాయలో పడి రూ.49,132 పోగొట్టుకున్న ఘటన చోటుచేసుకున్నది. మండలంలోని చెర్కూర్‌కు చెందిన కేశమోని రామకృష్ణగౌడ్‌కు యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఉన్నది. మరో క్రెడిట్ కార్డు కోసం ఐసీఐసీఐ బ్యాంక్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా సైబర్ నేరగాళ్లు కాల్ చేసి కార్డు మంజూరైంది. ఫోన్‌కు లింక్ వస్తుంది.. ఓపెన్ చేయాలని చెప్పారు. దీంతో మంగళవారం లింక్ ఓపెన్ చేయగా ఇప్పటికే తనకు ఉన్న క్రెడిట్ కార్డులో నుంచి రూ.49,132 మాయమయ్యాయి. దీనిపై సైబర్‌క్రైం టోల్ ఫ్రీ 1930కి కాల్ చేయడంతోపాటు వెల్దండ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

## ధర తగ్గిన ఉల్లి

- క్వింటాకు గరిష్ఠంగా రూ.3,610, కనిష్ఠంగా రూ.2,655

దేవరకద్ర, డిసెంబర్ 18 : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు 55 క్వింటాళ్ల ఉల్లిని విక్రయించేందుకు బుధవారం మార్కెట్‌కు తీసుకువచ్చారు. అయితే మూడు వారాలుగా మంచి డిమాండ్ ఉన్న ఉల్లి ధరలు తగ్గుముఖం పడుతుండడంతో రైతులు నిరాశకు లోనవుతున్నారు. బుధవారం నిర్వహించిన టెండర్లలో క్వింటాకు గరిష్ఠంగా రూ.3,610, కనిష్ఠంగా రూ.2,655 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## స్థానికంలో గులాబీ జెండా ఎగరాలి

- పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపు

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), డిసెంబర్ 18 : స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం కౌకుంట్లలో బీఆర్‌ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆలకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే పార్టీ జెండాను ఎగురవేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను ఈ ప్రభుత్వం ఎలా మోసం చేస్తున్నదో ప్రజలకు వివరించాలని, అదేవిధంగా పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం కౌకుంట్ల బీఆర్‌ఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా చందుగౌడ్, మండల యూత్ అధ్యక్షుడిగా లంకాల రాఘవేందర్‌రెడ్డితోపాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిన్నచింతకుంట, దేవరకద్ర, కౌకుంట్ల మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## చెంచులకు మైదాన ప్రాంతంలో ఆవాసం

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 18 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని బాచారం ఫారెస్టు భూముల్లో చెంచులకు పునరావాసం కల్పిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సువర్ణ తెలిపారు. బుధవారం ఎఫ్‌డీపీటీ సీఎఫ్ రాంబాబు, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఎఫ్‌డీవో తిరుమల్‌రావులతో కలిసి బాచారంలో పునరావాసం కల్పించే స్థలాన్ని పరిశీలించారు. అమ్రాబాద్ అభయారణ్యంలో పులుల సంరక్షణ కోసం అప్పర్‌ప్లాంట్‌లోని నివాస గ్రామాలైన కుడిచింతలబైలు, సార్లపల్లి, తాటిగుండాల, కొల్లంపెంట గ్రామాల ప్రజలకు నివాసం ఏర్పాటు చేసేందుకు అటవీశాఖ భూమిని 1501.88 ఎకరాలను రెవెన్యూ శాఖకు బదలాయించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించడం జరుగుతుందన్నారు. ఆమెవెంట ఎఫ్‌డీవో రామ్మోహన్, అమ్రాబాద్ ఎస్డీవో రామ్మూర్తి, ఫారెస్టు రేంజర్లు చంద్రశేఖర్, ఈశ్వర్, ఫారెస్టు సెక్షన్ అధికారి ముజీబ్ ఘోరి తదితరులు ఉన్నారు.



బాచారం అటవీ ప్రాంతంలో పునరావాస స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారి సువర్ణ

## డీసీసీబీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాస్ కుమార్, రాఘవేందర్ కుమార్, జ్యోతి

మహబూబ్‌నగర్ , డిసెంబర్ 18 : రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల నూతన రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన వీ శ్రీనివాస్‌కుమార్‌ను రాష్ట్ర అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోగా వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్‌కుమార్‌తోపాటు డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రాఘవేందర్, సెక్రటరీగా జ్యోతిని ఎన్నుకున్నారు. దీంతో డీసీసీబీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు సత్యప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ మాట్లాడుతూ సహకార బ్యాంకు ఉద్యోగుల సమస్యల కోసం కృషి చేస్తానని, జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చిన సంఘం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రాంబాబుకు జిల్లా సహకార బ్యాంకు ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.





మద్దూరు పాత బస్టాండ్ చౌరస్తాలో పటాకులు కాలుస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, కోస్గిలో సంబురాలు చేసుకుంటున్న నాయకులు

## మిన్నంటిన సంబురం

- పట్నంకు, లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు
- పటాకులు కాల్చిన నేతలు

మద్దూరు/కోస్గి, డిసెంబర్ 18 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన లగచర్ల రైతుల దాడి గురించి తెలిసిందే. ఈ ఘటనలో బీఆర్‌ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. నెల రోజుల తర్వాత బుధవారం నాంపల్లి కోర్టు పట్నంతోపాటు మరో 24 మందికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో, మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రంలో సంబురాలు మిన్నంటాయి. బీఆర్‌ఎస్ నాయకులు రోడ్లపైకి చేరి పటాకులు కాల్చారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ, వెంకట్ నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, సాయప్ప, నర్సింహ, శ్రీను, నర్సింహ, అంజితోపాటు మద్దూరు, కొత్తపల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.